# ...జై కొట్టు తెలుగోడా...

పసుపులేటి మల్లికార్జున రావు

దుర్గారావుది బెజవాడ!

అయినా అతనిప్పుడు న్యూయార్క్ వెళ్ళే మార్గంలో మొదటి మజిలీగా బొంబాయి అంతర్జాతీయ విమానాశ్రయంలో వున్నాడు.

అందుక్కారణం అతని మేనల్లుడు కనకారావు!

అతను నాలుగేళ్ళుగా అమెరికాలో వుంటున్నాడు . ఒక ప్రపంచ ప్రఖ్యాత కార్ల కంపెనీలో ఇంజనీరుగా! కనకారావుకు తన మేనమామ అంటే ఎంతో భక్తీ గౌరవం కూడాను. ఎందుకంటే చిన్నప్పుడే తల్లితండ్రుల్ని కోల్పోయిన కనకారావును, కంటికి రెప్పలా కాపాడి పెంచాడు. తను పెళ్ళి చేసుకుంటే ఆ వచ్చే 'పెళ్ళాం - మేనల్లుడిని సరిగ్గా చూసుకుంటుందో లేదోనని, పెళ్ళి కూడా మానుకున్నాడు.

అందుకు తగ్గట్టుగానే కనకారావు చిన్నప్పటినుంచీ చురుగ్గా చదువుతూ, అన్నిటా ఫస్టు వస్తూ, చదువే లోకంగా బతికాడు. దానికితోడు స్కాలర్ షిప్పులు దొరికేయి. చూస్తూండగానే "ఇంతింతైవటుడింతై..." అన్నట్లు ఆటో మొబైల్ ఇంజనీరుగా డిగ్రీ తీసుకుని, మంచి అవకాశం రాగా అమెరికా వెళ్ళి మరో మూడేళ్ళు అక్కడ చదివి ఫోర్డు కంపెనీ న్యూయార్కు ఆఫీసు సేల్సు మానేజరుగా అవకాశం రాగా చేరిపోయాడు.

మేనల్లుడు అమెరికాలో గొప్ప చదువులు చదివి ఇక్కడేదో దొరబాబులాంటి ఉద్యోగం చేస్తాడనిఆశపడ్డ దుర్గారావుకి కాస్త నిరాశ కలిగింది. కాని ఎంతో మంది అంతకన్నా గొప్ప అదృష్టమేమీ లేదని పదే పదే చెప్పడం వల్ల ఊరట చెందాడు.

కనకారావు అక్కడ ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచీ అక్కడ మువ్వొక్కడివి, ఇద్దరం ఇక్కడే వుందాం, వచ్చెయ్యి మామయ్యా" అని ప్రతి ఉత్తరం లోనూ రాస్తూ వుంటాడు.

అమెరికా ఎంత గొప్పదయినా కానీ, బెజవాడ ముందు బలాదూరేనని దుర్గారావు గర్విస్తాడు. ఇరవై ఏళ్ళక్రితం లారీ డ్రైవరుగా అతను బొంబాయి, మద్రాసు ఢిల్లీ కలకత్తా లాంటి మహానగరాలూ, రోడ్డు పక్కన నాలుగు గుడిసెలు కూడాలేని శివారు గ్రామాలు, అడవుల్లో విసిరేసినట్లుండే చిన్నచిన్న గూడేలూ చూసేడు. కానీ, బెజవాడ బెజవాడే.

పైగా బెజవాడ అన్న అసలు సిసలు మగసిరి గల ... మార్చి 'విజయవాడ' అన్న సన్నాసి పేరు పెట్టిన వాళ్ళంటే అతనికి వొళ్ళుమంట. ఈ పేర్లు మార్చడం ఏం రోగంవో? తల్లులకు తల్లి కనకదుర్గమ్మని బెజవాడ కనక దుర్గమ్మ తల్లి అంటారు గాని 'విజయవాడ బంగారు మాత' అనరు కదా? బెజవాడ గోపాలరెడ్డి గార్ని విజయవాడ గోపాల రెడ్డిగారు అంటామా? ఇట్లా పేరు మార్చినందుకు తెలుగు సన్నాసులు గనుక ఊరు కుంటారు గానీ, సిక్కులోళ్ళు అయ్యుంటే తోపేరాల్చేసి పోయుండేవని దుర్గారావు అంటాడు.

ఎప్పుడయినా బెజవాడ వొదిలి నాల్రోజులు పోవాలంటే ప్రాణం విలవిల్లాడుతుంది. కానీ తప్పలేదు. మేనల్లుడు గోల ఎక్కువైంది.

మూణ్ణెల్ల క్రితం "నువ్వు ఆ వూరూ, ఆ వుద్యోగం వదిలి రాకపోతే నేనిక్కడో దొరసాన్ని చూసి పెళ్ళి చేసుకుంటా. నీకు ఉత్తరాలు రాయను" అని వార్నింగ్ ఇచ్చేడు.

అయినా బెదర దల్చుకోలేదు. అయితే ఆ ఉత్తరం లోనే ఆఖర్న "తల్లివీ, తండ్రివీ అన్నీ అయి, పెంచి పెద్దచేసి, ఇంతవాడిని చేశావు. ఇక్కడ నేను బోలెడు సంపాదిస్తున్నాను. ఈ వయసులో హాయిగా కృష్ణారామా అనుకుంటూ కాలుమీద కాలు వేసుకో వలసిన వాడివి, అక్కడ నువ్వు కష్టపడుతుంటే నాకెలా వుంటుంది? అవుస్లే నేను రమ్మనగానే రావడానికి మా అమ్మవో నాన్నవో కావుగా" అన్న వాక్యాలు చదివేక నిజంగానే మేనల్లుడు తనని ఎంత ప్రేమగా చూస్తున్నాడో అర్ధం అయింది.

వెంటనే 'నీ ఇష్టంరా అబ్బీ' అని ఒక వుత్తరం రాయించేడు. అదుగో ఆ వుత్తరం తర్వాత మేనల్లుడు అమెరికానుంచే మామను రప్పించుకునే ఏర్పాట్లు చేశాడు.

అందుకే ఈ ప్రయాణం.

** ** **

ఆవూరూ ఆ ఇళ్ళు, ఆరొడ్లూకార్లూ, మనుషులూ అన్నీ చూస్తోంటే దుర్గారావుకి నోరు మూత పడలేదు. వారం పాటు బెజవాడ గుర్తురాలేదు. సరికదా అసలు తను భూమ్మీదనే ఉన్నాడో, కీర్తి శేషుడై మరో లోకానికి వచ్చేడో అర్ధంకాలేదు.

అంత స్వర్గంలోనూ దుర్గారావుని తికమక పెట్టింది భాష. ఆ గానట బీసట ఏమీ తలకెక్కలేదు. ఒక్క మేనల్లుడితో మాట్లాడితే తప్ప తెలుగు ఎక్కడా వినబడడంలేదు. అక్కడ తెలుగు వాళ్ళు చాలా మంది వున్నారని విన్నాడు కానీ ఏరీ? ఒక్కడూ కనపళ్ళేదు.

"ఇది మన బెజవాడ అయితేనో, వీళ్ళ భాష మన తెలుగు అయివుంటేనో ఎంత బాగుండు?" అనుకున్నాడు దుర్గారావు.

కనకారావు పది రోజుల పాటు సెలవు పెట్టి వీలయినన్ని ప్రదేశాలు చూపించాడు. ఎవరెవరినో పరిచయాలు చేశాడు. వాళ్ళ భాషలో రోజూ వాడే పదాలు చెబుతుండేవాడు. మాట్లాడే ప్రయత్నం చేయమని ప్రోత్సహిస్తున్నాడు.

దుర్గారావు కూడా 'మా బెజవాడ మా తెలుగు' అని భీష్మించుకోక ఏవో తంటాలు పడుతూనే వున్నాడు.

ఏదెలా వున్నా, ఆ దేశంలో దుర్గారావుకి నచ్చింది రోడ్లు. శుభ్రంగా, విశాలంగా ట్రాఫిక్ ఎటుదటు పోతూ గంటల తరబడీ జామ్ గాకుండా సాగిపోతోంది. వేల కొద్దీ కార్లూ, మరెన్నో వాహనాలు చీమల బారుల్లా సాగిపోతున్నా, చెవులు పగిలిపోయేలా హారన్లూ పోలీసుల విజిళ్ళూ ఏమీ లేవు. ట్రాఫిక్ సిగ్నల్స్ క్రమం తప్పకుండా పనిచేస్తున్నాయి తప్ప బెజవాడలాగానో, హైదరాబాదులాగానో చెడిపోయిన దీపస్థంభాల కింద ట్రాఫిక్ పోలీసులు చెమటలు కక్కుతూ డాన్సాడడం లేదు.


ఇహ ఎక్స్‌ప్రెస్ రోడ్లు అని వున్నాయి. అద్దంకన్నా నున్నగా మెరిసిపోతూ, పూచిక పుల్ల కూడా కనబడనంత శుభ్రంగా,.గీత గీసినట్లు మైళ్ళ తరబడీ ఒకటే దోవ.

ఆ రోడ్లు వేగంగా పోయే వాహనాల కోసమట. కొంత ఫీజు చెల్లించి ఆ రోడ్డెక్కితే నా సామిరంగా అద్భుతం. క్లచ్ వదిలి,ఆక్సిలేటర్ అదుగంటానొక్కినా ఎవరూ అడగరు. భయం మాటేలేదు.

"ఒక్కసారయినా మా కనకంగాడి కారు ఈ రోడ్డుమీద డ్రయివు చెయ్యాలి" అనుకున్నాడు దుర్గారావు.

ఈ చిరు కోరికని మేనల్లుడి చెవిన వేద్దామని అనుకుంటూ వుండగానే వచ్చింది కార్లపందెం.

శీతాకాలం పోయి, వేసవికాలం ప్రవేశించే రోజుల్లో కనకారావు పనిచేసే ఫోర్డు కంపెనీవారు ఈ పోటీ నిర్వహిస్తారు. అందువల్ల వారికి కావలసిన ప్రచారం



వుంటుంది. బహుమతి చాలా ఆకర్షణీయంగావుండడమే గాక, ప్రజల్లో బాగా పేరున్న సెనెటర్స్ తోనో, వైస్ ప్రెసిడెంట్‌లాంటి ప్రముఖులతోనో బహుమతి ఇప్పిస్తారు. దేశమంతటా టి.వి.లోవస్తుందీ కార్యక్రమం. కాగా ఇందులో మరో సులభమైన దేమంటే ఈ పందెంలో ఎవరయినా పాల్గొన వచ్చు అదృష్టం అంటే, హాఫ్ మిలియన్ డాలర్స్ ఒకరికే దక్కుతాయి. రెండో, మూడో బహుమతుల్లాంటివి వుండవు.

పోటీకి ముందు కొన్ని ప్రిలిమనరీస్ వుంటాయి... ఈ సారి వాటిని నిర్వహించాల్సిన బాధ్యత కనకారావు మీద పడింది.

** ** **

"నేను కూడా ఈ పోటీలో పాల్గొంటానురా అబ్బాయ్" అన్నప్పుడు కనకారావు నోరు కాసేపు మాంత్రికుడి గుహలా తెరుచుకుంది.

"నువ్వా?"

"ఏం?"

"అహో... మన డ్రైవింగ్ లైసెన్స్ ఇక్కడ చెల్లదు"

"కొత్తది తీసుకుందాం"

అంత సులభంకాదు..."

"ఏవిట్రా...? సులభం? ఏమిటి వాబోంద. డబ్బు డబ్బు పారెయ్... ఎంత సేపు? బెజవాళ్ళో ఎంత మంది అట్లా చెయ్యట్లే?"

"మన దేశం వేరు..."

"ఏడిశావ్‌గానీ, వాడెవడో చెప్పు నేమాట్లాడతాను"

## మరమనుషుల ముచ్చట

పశ్చిమ జర్మనీలో 450 మంది మరమనుషులు వివిధ పారిశ్రామిక సంస్థలలో పనిచేస్తున్నారు. ఇవి చేస్తున్న పని 1800 కార్మికులు చేసే పనికి సమానం. అంటే ఒక్కొక్క మరమనిషి నలుగురు కార్మికులకు సమానం. పశ్చిమ జర్మనీలోని పోల్క్ స్వాజెన్ సంస్థ వీటిని తయారుచేసింది.

మూడవ తరం మరమనుషుల తయారీ ఇప్పటికే ప్రారంభమైంది. ఇవి చూడగలవు. ఎలక్ట్రానిక్ మెదడులు, ఉక్కు చేతులు గల ఈ మరమనుషులు వెల్డింగ్, లోడింగ్, అన్‌లోడింగ్, అసెంబ్లింగ్ చేయగలవు.

పశ్చిమ జర్మనీ కానీ, లేక మరో పెద్ద పారిశ్రామిక దేశం కానీ మర మనుషులు లేకుండా మనలేవు. మరమనుషులువలన ఉద్యోగావకాశాలు తగ్గినప్పటికీ ఇవి కొత్త ఉద్యోగాలు మరింత ఉన్నత అర్హతలతో కొత్త ఉద్యోగులనుకూడా సృష్టించగలవు అని పోల్క్ స్వాజెన్ పర్సనల్ మేనేజర్ కార్ల్‌హేంజ్ బ్రియాన్స్ తెలియజేశారు. కొత్త కార్లతయారీ చాలా చిక్కులతో కూడుకున్నది. నిజానికి చాలా కొద్దిమంది మాత్రమే వెల్డింగ్ శాఖలో పనిచేస్తున్నారు. ఈ సంస్థలో విడి భాగాలను డ్రైవర్లు లేని రవాణా సంస్థ ద్వారా రవాణాచేస్తారు. ప్రమాదాలు అనేవి లేవు. శబ్దం, వేడి, శీతలం, దుమ్ము వలన మరమనుషులకు ఇబ్బంది లేదు. వాటికి పనిలో విసుగుదల ఏర్పడదు. జబ్బున పడవు. ఎక్కువజీతాల కోసం సమ్మెలు చేయవు. పైగా వాటి పని చాలా ఖచ్చితంగా, సునిశితంగాను వుంటుంది. వీటిలో పని చేసే కార్మికులు వీటి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. వీటి ప్రోగ్రాములను మార్చవలసినపుడు వీటిలో మరేదైనా లోపం దొర్లినపుడు మాత్రమే మాస్టరుఎలక్ట్రీషియన్లను పిలుస్తారు.

(గ్లోబల్)

"అహా... వొద్దులే, చూద్దాం"

"చూద్దాంకాదు..."

కనకారావుకి తప్పలేదు. లైసెన్సు లిచ్చేందుకు టెస్టు చేసే ఇనస్పెక్టరు కనకారావుకి పరిచయమే. కానీ ఎప్పుడూ ఎవరికీ ఇలా ఇప్పించలేదు. అసలు తనకే కొన్నాళ్ళు అబ్జర్వేషన్‌లో పెట్టి ఇచ్చాడు. అందుకు రెండు సార్లు పార్టీల పేరుతో, వాళ్ణి మేపడానికి రెండొందల డాలర్ల దాకా ఖర్చయ్యాయి.

పోయిన సారి రెండు డిన్నర్లకూ రెండొందలయితే, ఈసారి ఒక డిన్నరుకే మూడొందలయింది. అయితే పనికూడా రెండ్రోజుల్లో ఐపోయింది కాబట్టి బాధలేదు.

దుర్గారావు పేరు పోటీదార్ల లిస్టుకి ఎక్కింది.

ప్రిలిమినరీస్‌లో చాలామంది పోయారు. ఆఖర్న ముప్పయి మంది దాకా మిగిలారు. మూడ్రోజుల తర్వాత మరో సారి ప్రిలిమినరీస్‌లో ఇంకో పదిమంది నిగిపోయేరు. దుర్గారావు చివరి దాకా నెగ్గుకు రాగలిగాడు.

అసలు పోటీ ఆదివారం నాడు. సాధారంగా ఈ వీకెండునే ఈ పోటీ నిర్వహిస్తారు. ఎక్కువ మంది చూసే అవకాశం వుంటుందని.

పోటీ స్టేట్ అంపైర్ బిల్డింగ్ దగ్గర్నుంచి ప్రారంభమై, న్యూయార్క్‌కి పశ్చిమంగా ఎక్స్‌ప్రెస్ రోడ్డుమీదకి సాగి వెనక్కి రావాల్సి వుంటుంది.

పోటీకి ముందురోజు కారు ఏయే దోవ నుంచి ఎంత దూరం వెళ్ళాలో చూపిస్తారు. పోటీ ఐదొందల కిలో మీటర్ల దూరం. ఇందులో న్యూయార్క్‌లోనే వంద కిలోమీటర్లు. ఎన్నో మలుపుల నుంచీ ఫ్లైవో వర్సు మీదనుంచి పోయి న్యూయార్క్ సిటీదాటి, ఎక్స్‌ప్రెస్ రోడ్డు మీద మాటా యాభై కిలోమీటర్లు ప్రయాణించాలి. రెండొందల యాభయ్యో కిలోమీటరు దగ్గర మళ్ళీ అదే దోవన వెనక్కిరావాలి. ప్రతి యాభై కిలోమీటర్ల వద్ద, కారు వేగాన్ని అది ప్రయాణించిన దూరాన్నీ, టైమ్‌నూ లెక్కగడతారు కంప్యూటర్స్ సాయంతో.

తిరిగి వచ్చేటప్పుడూ అంతే!

పోయిన సారి రికార్డు నాలుగు గంటలకు అయిదు నిమిషాలు తక్కువ.

అంతా పోటీ రోజు కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఆ రోజూ వచ్చింది.

అయితే,

ఆ ముందు రోజు అంటే శనివారంనాడు దుర్గారావు బాంబులాంటి ఒక మాట వదిలాడు.

ఏమనీ? "అబ్బాయ్, నాకళ్ళు కనపడకుండా గంతలు కట్టుకొని కారు నడుపుతారా" అని.

"ఏంటే?" కనకారావు ఎగిరిపడ్డాడు.

"వాట్?" అడిగాడు పక్కనున్న అసిస్టెంట్.

"నువ్వు మాట మాటకీ అట్లా అవులించకురా అబ్బాయ్! నేను తెలుగులో అన్నాను. నువ్వు ఆ బాసలో వాళ్ళకి చెప్పు"

"అసాధ్యం"

"నీ మోహం" పోతే నేను పోతా, వాళ్ళకేం నష్టం లేదుగా? కావాలంటే, ఇది నేను నా ఇష్టపూర్తిగా, చేస్తున్నట్లు ఇందుకెవరి ప్రోత్సాహం, బలవంతం లేదని దస్తావేజు రాసిస్తా"

పక్కనున్న మిగతా నిర్వాహకులకు ఇదేమీ అర్థంకాక, కనకారావుని గోకేరు. కనకారావు చెప్పాడు.

వాళ్ళు దుర్గారావుని అనుమానంగా చూశారు.

"మీ మోహాలు తగలడ. ఏం చూపులని" అని లోపల్లోపల తిట్టుకున్నాడు దుర్గారావు. తన మంకు పట్టు వదల్లేదు.

మొత్తంమీద న్యూయార్క్ టైం ఈవెనింగ్ ఎడిషన్లో ఇదొక సెన్సేషనల్ ఐటం ఆవేళ. పత్రికల కాపీలు బ్లాక్‌లో అమ్మారని తెలిసి, ప్రెసిడెంట్ ప్రెస్ సెక్రటరీ పత్రిక మూసేయిస్తానని వార్నింగ్ ఇచ్చాడు. అది వేరే సంగతి.

** ** **

ఆదివారం ఉదయం - తొమ్మిది.

పందెం పదింటికి. అంతా వచ్చారు. ఈ సారి ఇసక వేస్తే రాలని జనం. ముఖ్యంగా దుర్గారావు అనే ఇండియన్ 'బ్లైండ్ ఫోల్డ్ డ్రైవింగ్ రేస్' చేస్తున్నాడన్న వార్త మొత్తం న్యూయార్క్‌ని రోడ్ల పక్కన నిల్చోబెట్టింది.

దుర్గారావుని పరీక్షించడం మొదలెట్టారు.

వాళ్ళంతా తడిమారు. మెటల్ డిటెక్టర్ లాంటి మెషిన్లశోధనకు గురిచేశారు. వాళ్ళ అనుమానం ఏమిటీ అంటే దుర్గారావు దగ్గర ఏదో "రిమోట్ సెన్సింగ్ కంట్రోల్ డివైస్" ఉండొచ్చని, అది శరీరంలో ఎక్కడయినా అమర్చుకుని వచ్చాడేమోనని.

"నన్నిట్లా వాళ్ళంతా పిసికి చంపకండిరా దొరలూ! కావాలంటే నేను గోచీ గుడ్డ తప్ప వొంటిమీద ఏమీ వుంచుకోను" అన్నాడు దుర్గారావు.

"వాట్?" మిగతా వాళ్ళడిగారు తెలుగు తేలిక.

"ఏం లేదు. బ్లైండ్ ఫోల్డ్ బాగా మందంగా వుండే అని అంటున్నాడు" కనకారావు చెప్పాడు. అతనికి ఒక పక్క మేనమామ మీద కోపంగా వుంది. పెద్దతనం వస్తోంది. ఏం కష్టపడతాడని పిలిపించుకుంటే ఇదొక గొడవ తెచ్చేడు తిని కూర్చోక. పోనీ, పెద్దాడు ముచ్చట పడుతున్నాడు, తనను ఎంతో అపురూపంగా పెంచాడో నన్న కృతజ్ఞత కొద్దీ ఏదో ఆ ముచ్చట తీర్చే ఏర్పాటు చేస్తే మరో మడత పేచీ.

ఏదయినా జరిగితే? పరాయిదేశంలో ఎన్నిచిక్కులు? ముందేవొద్దంటే పోయేది. పైగా తన మేనమామ అంటాడు "ఓరే, గెలిస్తే అయిదులక్షల డాలర్లు ఏదయినా జరిగితే వీరస్వర్గం" అని మీసాలు తిప్పడం.

వొళ్ళు మండింది. గానీ, అందర్లో ఏంచెయ్యడం?

కార్లరేసు ప్రారంభానికి అయిదు నిమిషాల ముందుగా సైరన్ మోగింది కార్లన్నీ సర్దుకున్నాయి. అందరూ కళ్ళమీద సేఫ్టీగ్లాసులూ, హెల్మెట్లూ సర్దుకున్నారు. అరచేతికన్నా మందపు గుడ్డతో కళ్ళు కట్టుకుని, జోడు లేకుండా కార్లో కూచున్న దుర్గారావుని మిగతా కార్లవాళ్ళు ఎగతాళిగా చూసేరు.

జనానికి ఎక్కడలేని కుతూహలం.

డమ్మీ పిస్తోలు ఢాం అంది గాల్లోకి.

కార్లు ముందుకు దూకాయి. చూస్తూ ఉండగానే కార్లు మలుపుల్లో కనుమరుగవుతూ వున్నాయి. చిత్రమేమిటంటే దుర్గారావు నల్లకారు అక్కడే వుండిపోతుందని చాలామంది అనుకున్నారు. కానీ లేదు.

అయోమయం. జనానికి అది కలో, నిజమో కూడా అర్థంకావడం లేదు. అయితే ప్రతి వాచ్ టవర్ వద్దా నల్లని కారు ముందు వెళ్ళిపోయినట్లు ప్రతివారూ చూశారు.

** ** **

పోయిన సారి రికార్డు కొద్ది నిముషాలు తక్కువ నాలుగుగంటలు కాస్త. దుర్గారావు బద్దలు కొట్టి, అది కేవలం మూడు గంటల ఒక నిముషం మాత్రమే రికార్డు చేశాడు. పైగా ప్రతి వాచ్ టవరు నుంచీ వచ్చిన వర్తమానం ఏమంటే దుర్గారావు కారు ముందే దాటింది, ఆ తర్వాత పావు గంటకు కాని మరో పందెపుకారు మొదటిసారి వాచ్ టవర్‌ని దాటలేదు.

కళ్ళకు ఏమీ కనబడకుండా గంతలు కట్టుకుని పాత రికార్డు అయిదు నిమిషాలు తక్కువ నాలుగు గంటలు కాస్తా మూడు గంటల ఒక నిముషం అంటే యాభై నాలుగు నిముషాలు తగ్గించడం మాటలా? ఇదెలా సాధ్యం? మాయా? మంత్రమా? అసలే ఇండియాలో

రాళ్ళనూ రప్పల్నీ పాముల్నీ దేవుళ్ళని చేసి పూజిస్తారు. ఆ పూజలు ఇటువంటి మంత్రాలు కాదుగదా?

అమెరికా జనానికి పిచ్చెక్కిపోయింది.

చైనా పర్యటనలో ఉన్న ప్రెసిడెంటుకీ వార్త తెలిసి. కొన్ని చిన్న కార్యక్రమాలను రద్దు చేసుకొని, ఎనిమిది గంటల ముందే వాషింగ్టన్ చేరుకునేందుకు నిశ్చయించేడు.

ప్రెసిడెంట్ వచ్చిన రెండో గంటకే, టి.వి.లో బహుమతి ప్రదానమూ అయిదు నిముషాలతో ఇష్టాగోష్ఠీ ఏర్పాటయింది.

కనకారావుకిదంతా అగమ్యగోచరంగా వుంది. కళ్ళకు గంతలు కట్టుకుని నాలుగు మెట్లు కూడా దిగలేము. అయిదొందల కిలోమీటర్లు పైగా యాభయి నాలుగు నిముషాల టైము తినేస్తూ ఉపద్రవమైన వేగంతో న్యూయార్క్ నగరంలో మలుపులూ, ఫ్లైవోవర్లు దాటుకుని చీమకి కూడా దెబ్బ తగల్నంత జాగ్రత్తగా, కారుని చిన్న గీతయినా పడవంత నేర్పుగా నడపడం 'మనిషన్నావాడికి సాధ్యమా?

ముందు కనకారావు అనుమానంగా మేనమామ కాళ్ళకేసి చూశాడు. అవి వెనక్కి లేవు. ముందుకే ఎప్పటిలాగానే వున్నాయి. జరిగింది తల్చుకుంటే నిజంగా తనకే పిచ్చెక్కిపోయేలా వుంది.

కాని దుర్గారావుమామూలుగానే వున్నాడు.

** ** **

ఫోర్డు కంపెని వారు తామివ్వవలసిన హాఫ్ మిలియన్ డాలర్ల బహుమతి ప్రెసిడెంట్ చేతిమీదుగా ఇప్పించడం దేశవ్యాప్తంగా ప్రజలు టి.వి.లో చూసి, దేశం అదిరి పోయేలా చప్పట్లు కొట్టేరు.

"వెల్ దుర్గారావ్ అమెరికా, భారత్ సత్సంబంధాలకు మీరు మరో మైలురాయిని వేసినారు" అని అభినందించాడు ప్రెసిడెంట్.

మళ్ళా దేశం దద్దరిల్లేలా చప్పట్లు దుర్గారావు వినయంగా వొంగి అచ్చం తెలుగువాడిలా నమస్కరించేడు.

అయిదు నిముషాలు, అమెరికా భారత్ సత్సంబంధాలు, రాజీవ్ గాంధీ కృషి దుర్గారావు పాత్ర అన్నఅంశంమీద మాట్లాడి ప్రెసిడెంట్ సెలవు పుచ్చుకున్నారు.

ఇప్పుడిక టి.వి. ఎనౌన్సర్ ఇంటర్వ్యూ.

మొదట్నించీ కనకారావు పక్కనే వున్నాడు. తన మేనమామ సాధించిన ఈ అద్భుతంలో అనుక్షణం తాను పక్కనే దుబాసీగా వ్యవహరిస్తున్నాడు. ఇందులో కీర్తి కాంక్షకన్నా, వచ్చీరాని అమెరికా భాషలో ఏం అవకతవకలు కూస్తాడోనని, వాళ్ళడిగినవి మేనమామకి చెప్పి, మామ బెజవాడ మోటు భాషలో చెప్పినవి నాజూగ్గా అనువదించి చెప్పడం ఎక్కువ.

"మిస్టర్ దుర్గారావ్! మీరీ రేసులో పాల్గొనాలని ఎందుకు భావించారో దయచేసి చెప్పగలరా?" ఎనౌన్సర్ అడిగింది.

"మీ రోడ్లుచూసి"

"అంటే..."

"వెడల్పుగా నుబ్బరంగా, ఎక్కడికక్కడ ఖచ్చితమైన సిగ్నల్స్, అందరూ వాటిని ఎంతో సహజంగా పాటిస్తూ క్రమపద్ధతిలో పోవడం"

ఎనౌన్సర్‌కి అర్థంకాలేదు. రోడ్లు శుభ్రంగా

## నేను

సితార తంత్రుల పైని
చివ్వుమని కుర్షించిన వానని
శతకోటి స్వేద రంధ్రాల పైని
నోళ్ళు విచ్చుకున్న రోమ రంధ్ర నయనాల్ని
తన్మయీ తన్మైక్యతలోని
వీర్య వాసనా రూప స్పర్శని
శబ్ద పరాగంలో విచ్చుకున్న
దూదేకుల మబ్బు సాయిబ్బుని
సెజెన్నీ చిత్ర విచిత్ర కల్పనా వర్ణాల్లోకి
దాక్కున్న త్రికోణాల చతురస్ర వృత్తాల్ని
బ్లేక్ జబ్బుపడిన గులాబీ
దళిత దళాల్లోకి ఇరుక్కున్న పురుగుని

—'మో'—


వేలాది కుటుంబాలు అనాదిగా వాడి చూడబడిన
**లవంగనూనె**
సద్గుణాలనిప్పుడు
**ప్రామిస్**
వాడి పొందగలుగుతున్నారు. మీరూ ఎందుకు వాడరాదు!




**ప్రామిస్**
- దంతక్షయం నుండి రక్షణకు తోడ్పడుతుంది.
- నోటిని తాజాగా రూపొందిస్తుంది.
- దుర్వాసనను అరికడుతుంది.

అంతర్జాతీయ స్వర్ణపతక విజేతలు

ఆరోగ్యాంచిందే పళ్ళు, చిగుళ్ళు, తాజాశ్వాస.

బల్సారా ఉత్పాదన


CHAITRA-BLS-668 TEL

ఉండవా? అందరూ ట్రాఫిక్ రూల్సు ప్రకారం క్రమ పద్ధతిలో నడుచుకోరా? అట్లా ఎందుకుంటుంది?

వాళ్ళ దేశానికి భిన్నమైన పరిస్థితి వుంటుందని పాపం వాళ్ళకి తెలీదు. ఆటోలనుంచీ లారీల దాకా ఫుట్ పాత్ లు ఎక్కి నడుస్తాయనీ, ఫుట్ పాత్ ల మీదా, రోడ్ల మధ్యా గుడిసె నుంచి డబ్బయి అంతస్తుల ఇళ్ళుకూడా కట్టు కుంటారనీ, జనం సైకిళ్ళాపి, నడిచి పోతూ పోతూ గుంపులు గుంపులుగా ఆగి రోడ్ల మధ్య తీరిగ్గా నిలబడి మాట్లాడు కుంటారనీ, రోడ్ల మధ్య అక్కడక్కడా బక్క చిక్కిన భారతదేశపు పశుసంపద కాగితపు ఉండల్నీ ప్లాస్టిక్ ముక్కల్నీ తాపీగా నెమరు వేసుకొంటూ విశ్రాంతిగా పడుకొంటాయనీ, చిన్నా పెద్దా భేదం లేక రోడ్లు గలీజు చేస్తుంటే దాన్ని శుభ్రంచేస్తూ పందులు మందలుగా తిరుగుతుంటాయనీ, వీటన్నిటి మధ్యనుంచీ మనుష్యులు అడ్డదిడ్డంగానే అయినా నిశ్చింతగా నడిచి పోతూ వుంటారనీ, పాపం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ అనే సర్కసు చేస్తుంటారనీ వాళ్ళకి తెలీక పోవడం బొత్తిగా అజ్ఞానం! కాదు, ప్రపంచ జ్ఞాన శూన్యత!

దుర్గారావు జవాబు అర్థంకాలేదో, అయ్యో మళ్ళీ సాగదియ్యడం ఎందుకనో, లేదా సమయ పాలనం అన్న పద్ధతికి కట్టుబడో, లేక పాడూ పెంటా అనే కార్య క్రమాలు ఉంటాయని తెలియకనో ఆ పాప మరో ప్రశ్న అందుకుంది.

''వెల్. ఈ బ్లైండ్ ఫోల్డ్ డ్రైవింగ్ అందునా,




రేసింగ్ చాలా ప్రమాదం. పైగా మీరు ఏ ఎలక్ట్రానిక్ పరికరం లేకుండా, నూట డబ్బయి కిలోమీటర్ల వేగాన ప్రయాణించారు. ఇంత నిర్భయమైన బ్లైండ్ ఫోల్డ్ డ్రైవింగ్‌ను మీరు ఎక్కడ, ఎలా, ఎప్పుడు ప్రాక్టీసు చేశారో దయచేసి వివరంగా చెప్పండి.''

దుర్గారావు నవ్వేడు. ''నాకేం పాత ప్రాక్టీసు లేదు''

''వ్వాట్?'' అనౌన్సర్ ఒక్కతేకాదు. టి.వి. చూస్తున్న దేశమంతా అదే తుళ్ళిపాటు.

''ఇటీజ్ ఇంపాజిబుల్...

ఈ సారి ''బట్ పాజిబుల్'' దుర్గారావే ఇంగ్లీషులో అన్నాడు.

''బట్ హౌ''

కనకారావు, దుర్గారావు తెలుగుని, వాళ్ళభాషకి అనువదించి చెబుతున్నాడు. ''అమ్మా మావూరు బెజవాడ......

''బెజవాడ?''

''యస్. నేనా వూర్లో గత ఇరవై సంవత్సరాలుగా సిటీ బస్ డ్రైవరుగా పనిచేస్తున్నా. నీ జీవితంలో ఎప్పుడయినా ఒకసారి మా వూరొచ్చి, ఆ రోడ్లు తిరిగి, ఆ బస్సుల్లో ప్రయాణిస్తే మరో వందజన్మల దాకా, నీకీ సందేహాలు రావు''

అనౌన్సర్‌తో సహా అమెరికా జనులకేమీ అర్థంకాక, తెల్లమొహం వేసుకుని చూస్తున్నారు. టి.వి.ని ఉపగ్రహం ద్వారా, ఢిల్లీ నుంచి రిలే అయ్యే ప్రసారాలను చూస్తున్న భారత పౌరులు అమితోత్సాహంతో చప్పట్లు ఓహ్! బాదేస్తున్నారు.

బెజవాడ పౌరులు మాత్రం ఆనందంతో ఈలలు కొడుతూ, కేకలేస్తూ, మేళతాళాలు వాయిస్తూ ఊరేగింపులు తీస్తూ, సంబరంగా రోడ్ల మధ్యలో పులీ, కుక్కా, పిల్లీ, దేవుళ్ళూ, దయ్యాల వేషాలు వేసుకుని ఎగురుతున్నారు. ●

MSCO
నవ యువ నవల విడుదలలు
డా॥సి.ఆనందారామం......... జీవితం ఒక విడుతలో ...... రు. 17/-

డా॥సి.ఆనందారామం......... జీవితం ఒక విడుతలో రు. 17/-
వసుంధర......................... నీకూ నీవారు లేరు / నాకూ నా వారు లేరు రు. 20/-
కన్నటి వవాలుం: నిరంజన్ / తెలుగుసీత: శర్వాణి ...... విమోచన రు.20/-
ఇచ్ఛాపురపు రామచంద్రం.. మృత్యువు రు.12/-
బద్దెపూడి సుధారాణి........ విధినిర్ణయం రు.12/-
రెడ్డి స్వరాజ్యలక్ష్మి.......... పల్లవి రు.12/-



ఈ పుస్తకాల కోసం మీ దగ్గరలో వున్న పుస్తక విక్రేత నడగండి. లేవంటే తెప్పించి పెట్టమనండి. వీలు కాదంటే మీకు కావలసిన పుస్తకాల ఖరీదు ఎమ్.ఓ. చేయండి. రిజిష్టర్డు పోస్టులో పంపుతాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్-3.

గృహిణుల ఆదరాభిమానాలు అందుకొన్న
శాంత టిల్టింగ్ వెట్ గ్రైండర్


santha


ధృఢమైన మోటారుతో పని చేస్తుంది.
నిశ్శబ్దమైన చలనం, 11-12 నిమిషాలలో పిండి తయారీ, శుభ్రపరచడం ఎంతో తేలిక,
ఆకర్షణీయమైన రంగులతో 1 లీటరు, $1\frac{1}{2}$ లీటరు, 2 లీటర్లు సైజులలో
అన్ని పట్టణములందు లభించును.

SUVARNA / PUSHPA

24 నెలల గ్యారెంటీ.. జీవితాంతం ఉచిత సర్వీసు!

* ప్రీతి ఎంపోరియమ్, PHONE: 64038
47-15-9, స్టేషన్ రోడ్, ద్వారకానగర్, వైజాగ్-16.
* మల్టి కమర్షియల్ ఎంటర్‌ప్రైజ్,
2-146/3, దుర్గామహల్ ఎదురుగా, పటమట,
విజయవాడ-6. PHONE: 52521.